క్లుప్తంగా

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు ఉచిత శిక్షణ

సత్యవేడు: ఇంటర్, ఐటీఐ, ఇతర కోర్సులలో ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీయువకులకు ఉచితంగా సత్యవేడు పాలిటెక్నిక్ కళాశాల వద్ద డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ జీ.ఉషాదేవి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పన నిమిత్తం స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో సిల్క్‌వాట్‌ను స్థాపించారు. ఇక్కడ శిక్షణ పొందిన అభ్యర్థులకు స్కిల్ ఇండియా సర్టిఫికెట్ ఇవ్వడంతోపాటు కంపెనీలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు నెలాఖరులోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇందుకోసం 9440374535 (చైతన్య) సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు. అభ్యర్థులు 18నుంచి 35 ఏళ్లలోపు ఉండాలని, శిక్షణా కాలం మూడునెలలని చెప్పారు.

ఎంఈఓ-2గా గున్నయ్య



వరదయ్యపాళెం: మండల విద్యాశాఖ అధికారి-2గా గున్నయ్య బుధవారం వరదయ్యపాళెంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన గోవర్ధనపురం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ ఉద్యోన్నతిపై ఎంఈఓగా నియమితులయ్యారు.

మోటార్ సైక్లిస్టుపై కేసు

ఏర్పేడు: మండలంలోని రాజులకండ్రిగ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైక్లిస్టుపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి బుధవారం రాత్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు..కందాడుకు చెందిన భాస్కర్ పాపానాయుడుపేట నుంచి శ్రీకాళహస్తికి బైక్‌లో వెళుతూ రాజులకండ్రిగ వద్ద ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతింది. బాధితుడు నాగరాజు ఫిర్యాదు మేరకు మోటార్ సైక్లిస్టుపై కేసు నమోదు చేశారు.

జగనన్న ఆణిముత్యాలకు సన్మానం



సన్మాన గ్రహీతలలో ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదవ తరగతిలో మంచి మార్కులు సాధించిన జాహ్నవి, ఆకాష్, సాయిప్రణవిని సన్మానించారు. నగదు ప్రోత్సాహకాలు, పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ రాజారెడ్డికి ఆత్మీయ వీడ్కోలు



రాజారెడ్డిని సత్కరిస్తున్న మహిళా వర్సిటీ వీసీ

తిరుపతి ఎడ్యుకేషన్: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీగా వ్యవహరించిన ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డిని బుధవారం మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.భారతి ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు. డీన్‌లు సుజాత, అనూరాధ, డిప్యూటీ రిజిస్ట్రార్లు, డైరెక్టర్లు, కోఆర్డినేటర్లు, సెక్షన్ హెడ్‌లు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

యువకుడి అదృశ్యంపై కేసు



నరేంద్ర (ఫైల్)

తిరుచానూరు(చంద్రగిరి): మానసిక దివ్యాంగ యువకుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు తిరుచానూరు ఎస్ఐ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు. పద్మావతిపురంలోని పాస్ మనోవికాస్ ఆశ్రమంలో నరేంద్ర(19) కొంత కాలంగా ఆశ్రయం పొందుతున్నాడన్నారు. రెండు రోజుల క్రితం నరేంద్ర ఆశ్రమం నుంచి కనిపించకుండా పోవడంతో నిర్వాహకులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. యువకుడి ఆచూకీ తెలిసిన వారు తిరుచానూరు సీఐ శివప్రసాద్ రెడ్డి-94407 96755, ఎస్ఐ వెంకటసుబ్బయ్య-93479 49532 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

ఇఎస్ఐలో యోగా దినోత్సవం



మాట్లాడుతున్న మెడికల్ సూపరింటెండెంట్

తిరుపతి కల్చరల్: శరీరాన్నీ, మనస్సునూ బ్యాలెన్స్ చేసే శక్తి యోగాకు మాత్రమే ఉందని ఇఎస్ఐ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ కె.శ్రీనాథ్ అన్నారు. బుధవారం ఇఎస్ఐ ఆస్పత్రిలో నిర్వహించిన అంతర్జాతీయ యోగాదినోత్సవంలో ఆయనతోపాటు ఆర్ఎంఓ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్లు రమేష్‌కుమార్, సునీత, ఎస్ఎస్ అమ్ములు, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ బీఎస్.నోయెల్ వినోద్ మాట్లాడారు. సిబ్బంది ట్రైనీ విద్యార్థినులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



శ్రీ శుక్రబ్రహ్మాశ్రమంలో యోగాసనాల కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతులు



తొట్టంబేడు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో..



ఏర్పేడు : చింతలపాలెం నర్సరీ వద్ద యోగా చేస్తున్న అటవీశాఖ అధికారులు

- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- యోగా ప్రాముఖ్యతను చాటిచెప్పిన ప్రముఖులు

శ్రీకాళహస్తి : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీశుకబ్రహ్మాశ్రమంలో ఆశ్రమ పీఠాధిపతి శ్రీ విద్యా స్వరూపానందగిరి స్వామిజీ, పరమాత్మానంద స్వామిజీ, ఆశ్రమ యోగసాధకులు మార్కొండేయులు ఉదయం 6 నుంచి రెండు గంటల పాటు యోగాసనాలు వేయించారు. వివిధ ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, బీజేపీ నాయకులు కోలా ఆనంద్, రమేష్‌బాబు, రాజేశ్వరరావు, యోగసాధకులు పాల్గొన్నారు.

- ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ పి.రాజశేఖర్ విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ దీనదయాల్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.
- పానగల్ సమీపంలో ఉన్న శ్రీచైతన్య స్కూల్‌లో ప్రిన్సిపల్ రూపాదేవి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు పలు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో డీన్ సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొట్టంబేడులో..

ఎస్వీపీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కేసీ.రేణుకమ్మ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. లైబ్రేరియన్ సత్యమూర్తి, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్ విద్యార్థినులు, లెక్చరర్లతో పలు ఆసనాలు వేయించారు. ప్రిన్సిపల్ పి.సుధాకర్, బ్రహ్మకుమారిలు రమణి, జ్యోతి యోగా ప్రాముఖ్యతను తెలియజేశారు. అధ్యాపకులు బాబు, డాక్టర్ ఉదయలక్ష్మి, సునీల్ కుమార్, హేమలత, భవంతి, టి.శైలజ, వి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

పాపానాయుడుపేటలో..

ఏర్పేడు : మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలుగు అధ్యాపకుడు బత్తెయ్య విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. అలాగే, అముదూరు, బండారుపల్లె అమృత్ సరోవర్ వద్ద కూలీలతో డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ యోగాసనాలు వేయించారు. నాగంపల్లె సమీపంలోని ఎస్ఓఎస్ బాలల గ్రామం, చింతలపాలెం అటవీశాఖ నర్సరీలో నిర్వహించిన యోగా దినోత్సవంలో ఏపీఓ దేవరి, అటవీ క్షేత్రాధికారి లోకేష్, ఈసీ బాలాజీరావు, సాంకేతిక క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

సత్యవేడు నియోజకవర్గం

సత్యవేడు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం యోగా దినోత్సవం పురస్కరించుకుని ఎంపీడీఓ కార్యాలయం, బాలుర ఉన్నత పాఠశాల, ఇరుగుళం, మదనంబేడు, బాలుర, బాలికల గురుకుల పాఠశాల, దాసుకుప్పం జెడ్పీ హైస్కూలు (తమిళం)లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, యోగాసనాలు వేశారు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. యోగా ప్రాముఖ్యత గురించి ఎంపీడీఓ మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్లు, కరాటే మాస్టర్ భాస్కర్, వైవీ.కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాలలో యోగా లోగోతో విద్యార్థులు



వెంగళత్తూరులో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

పిచ్చాటూరు మండలంలో..

పిచ్చాటూరు: పిచ్చాటూరు, వెంగళత్తూరు జెడ్పీ హై స్కూళ్లలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్స వం ఘనంగా నిర్వహించారు. వెంగళత్తూరులో పీహెచ్‌సీ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ ధనంజయులు మాట్లాడారు. . అనంతరం విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు గిరి ప్రకాష్ అధ్వర్యంలో విద్యార్థులు యోగసాధన చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఈశ్వర్ రెడ్డి, శరత్ బాబు, పీఈటీ అమ్ములు, టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



ఏర్పేడు : బండారుపల్లె వద్ద ఉపాధి కూలీలతో యోగా చేయిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక పూజిత బాలికల జూనియర్ కళాశాలలో సహజ సంపద సంయుక్త భాగస్వామ్యంతో డైనమిక్ ఫౌండేషన్ నిర్వాహకులు యోగా, మ్యూజిక్ ఫెస్టివల్ నిర్వహించారు. ప్రపంచ సంగీత, యోగా దినోత్సవం పురస్కరించుకుని పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఫౌండేషన్ సభ్యులు బొప్పన శ్రీనివాస్, నాగప్రసాద్, మాడస్వామి, రామసుబ్బయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సత్యవేడులో..



పిచ్చాటూరు : వెంగళత్తూరులో..



సత్యవేడులో యోగా అవగాహన ర్యాలీ

వేడుకగా గంగమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో ఉన్న పానగల్ గంగమ్మ



గంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

భక్తుల జన సందోహంతో పానగల్

శ్రీకాళహస్తి: పట్టణంలోని పానగల్‌లో గంగమ్మ జాతర బుధవారం వైభవంగా నిర్వహించారు. శ్రీకాళహస్తి, పరిసర గ్రామాల నుంచి వేలాది మంది ప్రజలు తరలివచ్చి గంగమ్మను దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించారు. బుధవారం తెల్లవారుజామున పానగల్ నుంచి సంప్రదాయబద్ధంగా అమ్మవారి మెరవణి ప్రారంభమై శ్రీరామనగర్ కాలనీ, బాలాజీ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ వీధుల మీదుగా సాగింది. రోడ్డుపై ఉన్న చావిడి వద్ద అమ్మవారిని ప్రతిష్ఠించారు. బెంగళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలతో అమ్మవారి అందంగా అలకరించారు. జాతర పురస్కరించుకుని దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానాలు, మజ్జిగ పంపిణీ చేశారు. అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో వేపాకు, నిమ్మకాయల మాలలు ధరించి, వేయికళ్ల దుత్తలను తలమీద ఉంచుకుని గంగమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. బైరాగి, బండ, తోటదుర్గమ్మ వేషాలు ధరించి పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతరకు వచ్చిన భక్తులు, బంధుమిత్రులతో పానగల్, హౌసింగ్‌బోర్డు కాలనీ, శ్రీరామనగర్, బాలాజీనగర్ వార్డులు జనం తాకిడితో కనిపించాయి. అమ్మవారిని తొట్టంబేడు మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి దర్శించుకున్నారు. ఆమెకు నిర్వాహకులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. అలాగే గంగమ్మను పలువురు పట్టణ ప్రముఖులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుజ్జిరెడ్డి, మధురెడ్డి, ముత్తురెడ్డి, యువకులు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. పూజల అనంతరం రాత్రి కోలాహలంగా నిమజ్జనం చేశారు.



నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

చెత్తాచెదారం తొలగింపు

మున్సిపల్ కమిషనర్ బాలాజీ నాయక్ ఆదేశాల మేరకు శానిటరి ఇన్‌స్పెక్టర్, మేస్త్రి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు నిర్విరామంగా పనిచేశారు. రోడ్డుపై ఉన్న చెత్తాచెదారాలను తొలగించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారు.

పోలీసులూ శభాష్

జాతర నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ భీమారావు అధ్వర్యంలో వన్‌టౌన్ సీఐ అంజూయాదవ్, ఎస్ఐ తిమ్మప్ప, కానిస్టేబుళ్లు గట్టి బందోబస్తు నిర్వహించారు. దగ్గరుండి ట్రాఫిక్‌ను నియంత్రించడంతో ప్రయాణికులు, భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.



గంగమ్మను దర్శించుకున్న పవిత్రారెడ్డి

రుచిగా, శుచిగా భక్తులకు భోజనం



అన్నప్రసాదాల నాణ్యత గురించి భక్తుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న చైర్మన్

–నిత్యాన్నదాన మండపం సిబ్బందికి చైర్మన్ ఆదేశం

శ్రీకాళహస్తి : ముక్కంటి దర్శనార్థం వచ్చే భక్తులకు నిత్యాన్నదానంలో రుచికరమైన భోజనం పెట్టాలని దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. బుధవారం చైర్మన్, పాలకమండలి సభ్యులు నిత్యాన్నదాన మండపానికి వెళ్లి అన్న ప్రసాదాలను పరిశీలించారు. వాటి నాణ్యతా ప్రమాణాలు ఎలా ఉన్నాయో భక్తులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇక్కడ వంటకు వినియోగించే సరుకులు, కూరగాయలను పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడారు. అన్న ప్రసాదాల్లో నాణ్యతా ప్రమాణాలు ఏమాత్రం తగ్గరాదని, రుచిగా, శుచిగా ఉండాలన్నారు. అలాగే భక్తులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా నడచుకోవాలన్నారు. రోజూ 5వేల నుంచి 7 వేల మందికి భోజనం, రాత్రి సమయంలో 2,500 మంది భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి సభ్యులు కొండూరు సునీత, పసల సుమతి, ప్రత్యేక ఆహ్వానిత సభ్యులు జూలకంటి సుబ్బారావు, చింతామణి పాండు, దేవస్థానం అధికారులు, అన్నదాన సిబ్బంది పాల్గొన్నారు.



చైర్మన్‌కు విరాళం ఇస్తున్న ఆర్కే కిషోర్

నిత్యాన్నదానానికి విరాళం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వర దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి బుధవారం విజయవాడకు చెందిన ఆర్కే కిషోర్ తన కుటుంబ సభ్యులతో రూ.1,01,116ను చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం ఆలయ అధికారులు వారికి స్వామి, అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



విజేతలకు ప్రశంసా పత్రాలు ఇస్తున్న యూబీఐ మేనేజర్ గోవిందరాజులు, హెచ్ఎం గిరిప్రకాష్

పిచ్చాటూరు: స్థానిక జెడ్పీ హైస్కూలులో విద్యార్థులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్విజ్ పోటీలు నిర్వహించింది. బ్యాంక్ మేనేజర్ గోవిందరాజులు మాట్లాడుతూ, ఆర్‌బీఐ ఆదేశాల మేరకు ఆల్ ఇండియా ఫైనాన్సియల్ లిటరసీ అనే అంశంపై మండలంలోని ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ పోటీల్లో స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థి విజయ్‌కు మొదటి బహుమతి, వెంగళత్తూరు హైస్కూల్ విద్యార్థినులు ఝాన్సీరాణి, సంజన లకు ద్వితీయ బహుమతి, రజానగరం విద్యార్థినులు మానస, బాల సంధ్యలకు తృతీయ బహుమతులు, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ డి.వెంకయ్య, ప్రధానోపాధ్యాయులు గిరిప్రకాష్, పీఈటీ అములు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: బ్యాంకు ఆర్థిక లావాదేవీల అక్షరాస్యత అంశంపై బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ నాగార్జున్ క్విజ్‌పోటీలు నిర్వహించారు. మండలంలోని 5 హైస్కూళ్ల నుంచి 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు బ్యాంకు మేనేజర్ నాగార్జున్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బ్యాంకు లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ. 5 వేలు బుచ్చినాయుడుకండ్రిగ ఉన్నత పాఠశాల విద్యార్థులు దయానా, ఏఎస్ పుష్కాల్, రెండవ బహుమతి రూ. 4 వేలను చల్లమాంబపురం విద్యార్థులు పూంగోది, ఆదర్శని, మూడవ బహుమతి రూ.3 వేలను పల్లమాల విద్యార్థులు కిరణ్ తేజ్, కారుణ్య దక్కించుకున్నారు. బహుమతుల సొమ్మును విద్యార్థుల బ్యాంకు ఖాతాలలో జమ చేస్తామని నిర్వాహకులు చెప్పారు. ఉపాధ్యాయులు శిరోమణి తదితరులు పాల్గొన్నారు.



బుచ్చినాయిడుకండ్రిగ : విద్యార్థిని దయానాకు ప్రశంసా పత్రం ఇస్తున్న హెచ్ఎం, బ్యాంక్ మేనేజర్



నాగలాపురంలో..

నాగలాపురంలో ..

పిచ్చాటూరు: నాగలాపురం దళితవాడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ తిరవియరాజ్ మాట్లాడుతూ, ఆర్‌బీఐ ఆదేశాల మేరకు ఆల్ ఇండియా ఫైనాన్సియల్ లిటరసీ అనే అంశంపై 8,9,10వ తరగతుల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. ఇందులో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. క్విజ్‌లో ప్రతిభ కనబరచిన నాగలాపురం ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి ఎం.తేజేశ్వర్, ఎ.సింధుజకు మొదటి బహుమతిగా రూ.5వేలు, వేంబాక్కం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు మధుమిత, విజయలక్ష్మిలకు ద్వితీయ బహుమతిగా రూ.4వేలు, వేంబాక్కం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సదా, రోషన్‌లకు తృతీయ బహుమతిగా రూ.3 వేల నగదు, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాతయ్య, టీచర్లు వెంకటరమణ, గోవర్ధన్, అయ్యప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

హంస వాహనంపై పరాశరేశ్వరుడు



నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో బుధవారం సాయంత్రం హంస వాహనంపై స్వామి వారు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో నిత్యపూజా కైంకర్యాలు, పరివార దేవతలకు అభిషేకాలను నిర్వహించి నైవేద్యం సమర్పించారు. 10 గంటలకు చంపకవల్లీ, పరాశరేశ్వరులకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాలను అందుకున్న ఉత్సవ మూర్తులు వీణ ధరించి హంస వాహనాన్ని అధిరోహించారు. సర్కారు హారతి అందుకున్న దేవేరులు గ్రామోత్సవంలో భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్, జమేదార్ రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా వినాయక సాగర్

- ఆధునిక వసతులతో స్విమ్మింగ్ పూల్
- కమిషనర్ హరిత

తిరుపతి తుడా: నగరంలో అభివృద్ధి చేస్తున్న వినాయక సాగర్‌ను ప్రముఖ పర్యటక కేంద్రంగా అందుబాటులోకి తీసుకొస్తామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. బుధవారం వినాయకసాగర్ అభివృద్ధి పనులతో పాటు పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. సాగర్ పనులు నత్తనడకన సాగుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేగంగా పూర్తి చేసి నగర ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. స్విమ్మింగ్ పూల్‌ను ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దాలని ఇంజినీర్లకు సూచించారు. లాన్‌లు, గార్డెనింగ్ పనులు ఆకర్షణీయంగా ఉండాలన్నారు. అలాగే ఐలాండ్ వెళ్లే మార్గంలో డబుల్ బారికేడ్ ఏర్పాటు చేయాలని సూచించారు. సాగర్‌లోని చెత్తను తొలగించే పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం లీలామహల్ కూడలి నుంచి కరకంబాడి మార్గంలో ఫుట్‌పాత్‌లు, డ్రెయినేజీ కాలువలను పరిశీలించారు. ఆక్రమణలు తొలగించాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ.. నగర ప్రజలకు అత్యాధునిక సౌకర్యాలను కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. తిరుపతిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టులు పూర్తయితే ప్రజలకు సౌకర్యవంతంగా వసతులు పెరుగుతాయని తెలిపారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి పాల్గొన్నారు.



వినాయక సాగర్ పనులను పరిశీలిస్తున్న హరిత